

2

## పంట మార్పిడి విధానాలపై అవగాహన కల్పించాలి

- ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి.


# మనం





నిజామాబాద్ కామారెడ్డి

గురువారం । 7 । మే । 2026 పేజీలు: 7


# కల్లాల్లోనే వడ్లు.... కష్టల్లోనే రైతు...!





- రైతుల కష్టాలు ఎవరికి కనిపించవా..?
- పంట పండించడం కంటే అమ్ముకోవడం కష్టంగా మారింది.
- వాన పడితే పంట పాడవుతుందనే భయం.
- మానసికంగా కుంగిపోతున్న రైతన్నలు.

ఆర్మూర్, మే 6 ( మనం న్యూస్ ): ఆర్మూర్ మండలం మరియు గోవింద్ పేట్ పరిసర ప్రాంతాల్లో రైతుల దుస్థితి రోజురోజుకు దారుణంగా మారుతోంది. పంటను రక్తం చెమటలతో పండించిన రైతు, ఇప్పుడు అదే వడ్లను కల్లాల్లో ఎండబెట్టుకుంటూ కష్టాల్లో మగ్గుతున్న దృశ్యాలు హృదయ విదారకంగా మారాయి. కొనుగోలు కేంద్రాలు సకాలంలో ప్రారంభం కాకపోవడం, ప్రారంభమైన చోట సరైన ఏర్పాట్లు లేకపోవడం రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. పొలాల్లో పండిన ధాన్యం గోదాములకు వెళ్లాల్సింది పోయి, రోడ్ల పక్కనే, కల్లాల్లోనే పేరుకుపోతోంది. ఎండలో వడ్లు ఎండబెట్టడం, రాత్రిళ్లు కాపలా కాయడం రైతుల రోజువారీ జీవితంగా మారింది. వాన పడితే పంట పాడవుతుందనే భయం, ఎండలో ఉంటే నాణ్యత తగ్గుతుందనే ఆందోళన, ఇవి రైతును మానసికంగా కూడా కుంగదీస్తున్నాయి. అధికారులు మాత్రం పత్రాలపైనే పరిమితమైపోతున్నారు. క్షేత్ర స్థాయిలో సమస్యలు కనిపించినా స్పందన కనిపించడం లేదు. మద్దతు ధరపై కొనుగోలు చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం, ఆచరణలో మాత్రం రైతును అనాథలా వదిలేస్తుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పంట పండించడం కంటే అమ్ముకోవడమే కష్టం అన్నది రైతు నిస్సహాయ అరుపుగా మారింది. సరైన సమయంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి, తక్షణమే ధాన్యం కొనుగోలు చేయాలని

-మిగతా 2లో



2

## గ్రామాల్లో తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి

- ప్రతి ఇంటికి నిరంతరాయంగా తాగునీరు అందించాలని అధికారులకు ఆదేశాలు.
- ప్లాస్టిక్ సేకరణ వినూత్న విధానానికి కలెక్టర్ ప్రశంసలు.
- తాడ్వాయి మండలం ఏంద్రియాల్ గ్రామాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్.

## కాంగ్రెస్లోకి భారీగా చేరికలు

- ఎమ్మెల్యే భూపతి రెడ్డి సమక్షంలో చేరికలు.
- సంక్షేమ పథకాలపై ఆకర్షితులై పార్టీలో చేరికలు.
- యానం పల్లి సర్పంచ్ తోట భాస్కర్ సహా పలువురు చేరిక.
- కాంగ్రెస్ కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే.



3

# కల్లాల్లోనే వడ్లు.... కష్టాల్లోనే రైతు...!

### మొదటి పేజీ తరువాయి







రైతులు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో కల్లాల్లోనే వడ్లు పాడైపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు మేల్కొని రైతుల సమస్యలను పరిష్కరించాలనే ఆశతో రైతు ఎదురు చూస్తున్నాడు. లేకపోతే కల్లాల్లోనే వడ్లు కష్టాల్లోనే రైతు అన్న పరిస్థితి మారదని స్పష్టమవుతోంది.

**తరుగులో రైస్ మిల్లులు రైతులకు శాపం...**
**- తరుగు, పేరుతో క్వింటలకు 5 కిలోలు కడ్తా.**

తరుగు పేరుతో రైస్ మిల్లులు రైతులకు శాపంగా మారుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పంటను విక్రయించడానికి వచ్చిన రైతులను మిల్లర్లు వివిధ కారణాలతో ఇబ్బందులకు గురి చేస్తూ, తక్కువ ధరలు ఆఫర్ చేయడం తీవ్ర అసంతృప్తికి దారితీస్తోంది. రైతులు చెబుతున్నదేమిటంటే ప్రభుత్వ సూచించిన కనీస మద్దతు ధర (ఎం ఎస్ ఎం పి ) ప్రకారం ధాన్యాన్ని కొనుగోలు చేయాల్సిన మిల్లర్లు, తేమ శాతం, నాణ్యత తరుగు వంటి కారణాలు చూపిస్తూ క్వింటాల్కు 5 కిలోలు తగ్గించి ధరలు నిర్ణయిస్తున్నారు. దీంతో రైతులకు భారీ నష్టం వాటిల్లుతోంది. మరింతగా, ధాన్యం తూకంలోనూ అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొంతమంది మిల్లర్లు తక్కువ తూకం చూపించడం ద్వారా రైతులపై అదనపు భారం మోపుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే, చెల్లింపులు ఆలస్యంగా చేయడం వల్ల రైతులు అప్పుల బారిన పడుతున్న పరిస్థితి ఏర్పడుతోంది.

ఇదిలా ఉండగా, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు సరైన సమయానికి ప్రారంభం కాకపోవడం వల్ల రైతులు మిల్లర్లపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతు సంఘాలు అంటున్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా ఈ అక్రమాలు పెరుగుతున్నాయని వారు ఆరోపిస్తున్నారు.

ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి మిల్లర్ల అక్రమాలపై చర్యలు తీసుకోవాలని, రైతులకు న్యాయం చేయాలని రైతులు, రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నారు.

**హమాలీలు కోరతతో రైతులకు భారం...**

నగరాలకు వలసలు పెరగడం వంటి కారణాలతో హమాలీలు తగ్గిపోవడం జరిగింది. దీనితో పనిభారం పెరిగిన మిగిలిన కార్మికులు అధిక కూలీ డిమాండ్ చేస్తున్నారు. గతంలో బస్తాకు తీసుకునే కూలీకి పోలిస్తే ప్రస్తుతం 20 నుంచి 30 శాతం వరకు పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు. రైతులు తమ పంటను మార్కెట్కు తీసుకొచ్చిన తర్వాత హమాలీలు లేక ఆలస్యమవుతుండడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సరుకు ఎక్కించడం, దిగించడం ఆలస్యమవడం వల్ల ట్రాన్స్పోర్ట్ ఛార్జీలు కూడా పెరిగాయి. దీంతో మొత్తం వ్యయభారం రైతులపై పడుతోందని రైతులు ఆవేదన చెందుతున్నారు.



## పంట మార్పిడి విధానాలపై అవగాహన కల్పించాలి

**- ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి.**

బాన్సువాడ, మే 06 ( మనం న్యూస్ ): పంట మార్పిడి విధానాలపై రైతులకు అధికారులు అవగాహన కల్పించాలని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి సూచించారు. మండలంలోని దేశాయిపేట గ్రామంలో బుధవారం రైతు వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పోచారం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ., రైతుల ఆదాయం తగ్గకుండా పంట మార్పిడి విధానాలపై వ్యవసాయ అధికారులు సమగ్ర అవగాహన కల్పించాలని సూచించారు. రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించి అధిక దిగుబడుల దిశగా రైతులు అడుగులు వేయాలని కోరారు. సేంద్రియ ఎరువుల వినియోగంతో సాగు ఖర్చులను గణనీయంగా తగ్గించుకోవచ్చని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం, సేంద్రియ పద్ధతులను అనుసరించడం ద్వారా నేల ఆరోగ్యం కాపాడుకోవడంతో పాటు దీర్ఘకాలికంగా మెరుగైన దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని, ఖర్చు తగ్గించి లాభాలు పెంచుకునే మార్గాలను అన్వేషించాలని రైతులకు సూచించారు. అధికారులు క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉండి రైతులకు సాంకేతిక సలహాలు అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కత్తెర గంగాధర్, సొసైటీ ఛైర్మన్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## గ్రామాల్లో తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి

**- ప్రతి ఇంటికి నిరంతరాయంగా తాగునీరు అందించాలని అధికారులకు ఆదేశాలు.**

**- ప్లాస్టిక్ సేకరణ వినూత్న విధానానికి కలెక్టర్ ప్రశంసలు.**

**- ప్రజల్లో మంచి స్పందన తెచ్చిన, కిలో ప్లాస్టిక్ అందజేస్తే టిఫిన్ బాక్స్ బహుమతి.**

**- తాడ్వాయి మండలం ఏండ్రియాల్ గ్రామాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్.**



కామారెడ్డి, మే 06 (మనం జిల్లా ప్రతినిధి): జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తాడ్వాయి మండలం ఏండ్రియాల్ గ్రామాన్ని బుధవారం సందర్శించి, గ్రామంలో తాగునీటి వనరులు, మౌలిక సదుపాయాలను పరిశీలించారు. గ్రామంలో అందుబాటులో ఉన్న నీటి వనరులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో మూడు మంచి నీటి ట్యాంకులు, నాలుగు బోరు బావులు, పంప్సెట్లు ఉన్నట్లు అధికారులు తెలిపారు. అలాగే 396 ఇంటి ఇంటి నల్ల కనెక్షన్లు ఉన్నట్లు వివరించారు. మిషన్ భగీరథ పథకం కింద తాగునీటి సరఫరా ఎలా జరుగుతోందో సర్పంచ్ను కలెక్టర్ ప్రశ్నించారు. గ్రామ ప్రజలకు నిరంతరాయంగా, నాణ్యమైన తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రతి ఇంటికి సురక్షిత తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. నీటి వనరుల నిర్వహణ, సరఫరా వ్యవస్థపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు.

**ప్లాస్టిక్ వ్యర్థాల నియంత్రణ ద్వారా పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటు.**

గ్రామంలో ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణలో అమలు చేస్తున్న వినూత్న కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రశంసించారు. కిలో ప్లాస్టిక్ సేకరించి అందజేసిన వారికి టిఫిన్ బాక్సు బహుమతిగా ఇవ్వడం ప్రజల్లో మంచి స్పందన పొందుతోందని తెలిపారు. ఈ విధానం వల్ల గ్రామస్తులు పెద్దఎత్తున ప్లాస్టిక్ సేకరణలో పాల్గొంటున్నారని అభినందించారు. ప్లాస్టిక్ వ్యర్థాలు భూమిలో కలిసిపోకుండా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడే చర్యలపై సంతోషం వ్యక్తం చేశారు. ఇదే తరహా కార్యక్రమాలను ఇతర గ్రామాల్లో కూడా అమలు చేసి, ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని సూచించారు. వేసవి నేపథ్యంలో అన్ని గ్రామాల్లో చలివేంద్రాల ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ అధికారులు, మండల ప్రత్యేక అధికారి, డి.ఎల్.పి.ఓ., ఎంపీడీవో, ఎమ్మార్వో, హౌసింగ్ డిఈ, ఎంఈఓ, వ్యవసాయ అధికారి తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్లోకి భారీగా చేరికలు

- ఎమ్మెల్యే భూపతి రెడ్డి సమక్షంలో చేరికలు.
- సంక్షేమ పథకాలపై ఆకర్షితులై పార్టీలో చేరికలు.
- యానం పల్లి సర్పంచ్ తోట భాస్కర్ సహా పలువురు చేరిక.
- కాంగ్రెస్ కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే.





నిజామాబాద్ రూరల్, మే 6 (మనం న్యూస్): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ఆకర్షితులై ప్రజలు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి తెలిపారు. డిచ్పల్లి మండలం యానం పల్లి గ్రామ సర్పంచ్ తోట భాస్కర్, వార్డు సభ్యులు మహేష్, గోవర్ధన్ గౌడ్తో పాటు పలువురు గ్రామస్తులు బీజేపీ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ., యానంపల్లి గ్రామంతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధికి కట్టుబడి ఉంటానని, రోడ్డు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై ప్రజలు నమ్మకం కోల్పోయారని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆదేశాలతో విండో చైర్మన్గా మీర్జా ఇమామ్ బేగ్కు కొనసాగింపు

**నీలా గ్రామంలో సంబరాల వెల్లువ**

రెంజల్, మే 06 (మనం న్యూస్) : ప్రభుత్వ ఆదేశాల మేరకు నీలా గ్రామ విండో చైర్మన్గా మీర్జా ఇమామ్ బేగ్ను కొనసాగిస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది. ఈ నిర్ణయంతో గ్రామంలో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. ఇప్పటికే విండో చైర్మన్గా సమర్థవంతంగా సేవలు అందిస్తున్న మీర్జా ఇమామ్ బేగ్కు కొనసాగింపు రావడం పట్ల గ్రామ ప్రజలు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆయన నాయకత్వంలో గ్రామ అభివృద్ధి పనులు వేగవంతం కావడంతో పాటు ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందుతాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా అనుచరులు పటాకులు పేల్చి, మిఠాయిలు పంచుకుంటూ సంబరాలు జరుపుకున్నారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. మీర్జా ఇమామ్ బేగ్కు పెద్ద ఎత్తున అభినందనలు వెల్లువెత్తాయి. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ క్యాతం యోగేష్, ఎస్. రాందాస్ తదితర ప్రముఖులు పాల్గొని అభినందనలు తెలిపారు. మీర్జా ఇమామ్ బేగ్ మాట్లాడుతూ., తనపై విశ్వాసం ఉంచిన ప్రభుత్వానికి, గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ అభివృద్ధి, ప్రజల సంక్షేమం తన ప్రధాన లక్ష్యమని, మరింత కృషి చేసి నీలా గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని పేర్కొన్నారు.



## బక్రీద్ దృష్ట్యా పశువుల అక్రమ రవాణాపై కఠిన చర్యలు

- ఇందల్వాయి టోల్ ప్లాజా చెక్పోస్టు ఏసీపీ తనిఖీ
- పత్రాలు లేకుండా రవాణా చేస్తే కేసులు నమోదు హెచ్చరిక.
- వాహనాలపై కఠిన తనిఖీలు చేపట్టాలని ఆదేశాలు






నిజామాబాద్ రూరల్, మే 6 (మనం న్యూస్): రాబోయే బక్రీద్ పండుగను దృష్టిలో ఉంచుకుని పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు ఇందల్వాయి టోల్ ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక చెక్పోస్టును నిజామాబాద్ ఏసీపీ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమంగా పశువులను రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. చట్ట ప్రకారం కేసులు నమోదు చేయబడతాయని హెచ్చరించారు. పశువులను రవాణా చేసే వారు తప్పనిసరిగా సరైన పత్రాలు వెంట తీసుకురావాలని, లేకపోతే చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు. చెక్పోస్టుల వద్ద పోలీసులు అప్రమత్తంగా ఉండి ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిచ్పల్లి సీఐ కె వినోద్, ఇందల్వాయి ఎస్ఐ సందీప్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




## కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కృషి చేస్తా.

**బిచ్కుంద కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడిగా భాస్కర్ రెడ్డి.**



బిచ్కుంద, మే 6 (మనం న్యూస్): కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కృషి చేస్తానని నూతనంగా ఎన్నికైన బిచ్కుంద పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భాస్కర్ రెడ్డి అన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ., కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చిన తర్వాత బిచ్కుందలో చేసిన అభివృద్ధి పథకాలను ప్రజలకు అందేలా జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు సహకారం కృషి చేస్తానని ఆయన అన్నారు. మండలంలోని 23 గ్రామ పంచాయతీలు అత్యధిక కాంగ్రెస్ పార్టీ సర్పంచులను గెలుచుకున్నామని అదే దిశలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తానని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మల్లికార్జున్ కు ఎమ్మెల్యే కాంతారావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు భూమయ్య కుటుంబానికి పరామర్శించిన రాష్ట్ర అధ్యక్షులు

బిచ్కుంద, మే 6 (మనం న్యూస్): ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు మేడి పాపన్నమాదిగ బుధువారం శాంతాపూర్ గ్రామానికి వచ్చి కామారెడ్డి జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు భూమయ్య కుటుంబానికి పరామర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సుభాష్ కామారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు, సింగం కాశీరం నిజామాబాద్ జిల్లా నగర అధ్యక్షులు, మల్లమరి సుధాకర్ నిజామాబాద్ జిల్లా మహిళా నగర అధ్యక్షురాలు సమాధాన జిల్లా



అధ్యక్షురాలు లత, వర్కింగ్ ప్రెసిడెంట్ కామారెడ్డి జిల్లా ఇంచార్జ్, పోసాని, బోధన్ టౌన్ అధ్యక్షులు లింగం, డివిజన్ అధ్యక్షులు రాములు కృష్ణ, జుక్కల్ నియోజకవర్గ ఇంచార్జ్ వెండి యాదవరావు నియోజకవర్గ అధ్యక్షులు సాయిలు అన్ని మండల అధ్యక్షులు సర్వగల రవీందర్ కేమైపాల్ శంకర్ ఆయిల్ వార్ మారుతి ఉపాధ్యక్షులు బలరాం, అంబయ్య, మండల ప్రధాన కార్యదర్శి సురేష్ యూత్ అధ్యక్షులు రవి, సీనియర్ నాయకులు మారుతి, హన్మాండ్లు, సాయిలు, రాజు, అనిల్, సాయిరాం, గంగారం, ఎమ్మార్పీఎస్ తదితరులు పాల్గొన్నారు.





## పేదల సొంతింటి కలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుంది

**- రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి.**

నిజామాబాద్, మే 06 ( మనం జిల్లా ప్రతినిధి ): పేదల సొంతింటి కలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తోందని రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి అన్నారు. ఈ మేరకు నిజామాబాద్ జిల్లా భీంగల్ మండలం సికింద్రాపూర్లో లబ్ధిదారు మాలెపు అర్చన రాజు, బడా భీమ్గల్ శంకరి ప్రమీల, వేల్పూర్ మండలంలోని పడగల్లో మందల లింగుబాయి ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా నిర్మాణాలు జరుగుతున్నాయని ఈ సందర్భంగా మానాల మోహన్రెడ్డి తెలిపారు. భీమ్గల్ మండలంలో ఇప్పటికే 60శాతం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. రాష్ట్రంలో ప్రతి పేదవాడికి నివాసం కల్పించాలనే సంకల్పంతో సీఎం రేవంత్రెడ్డి ఉన్నారన్నారు. మరో నెల రోజుల్లో రెండో విడతలో 3,500 ఇళ్లకు మంజూరు రానుందన్నారు. ఈ కార్యక్రమంలో భీమ్గల్ మున్సిపల్ చైర్మన్ బొదిరే స్వామి, వైస్ చైర్మన్ జేజే నర్సయ్య, కౌన్సిలర్ నాగేంద్ర బాబు, సర్పంచ్లు రమేష్, నరేందర్, రాజు, భూమారెడ్డి, సురేష్, ఉప సర్పంచ్ నరేందర్, మల్లారెడ్డి నరేష్, నితీష్, జలం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన బోధన్ ఎస్ఐ

నిజామాబాద్, మే 06 ( మనం బ్యూరో ) : బోధన్ పట్టణంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు కీలకంగా వ్యవహరిస్తూ లంచం తీసుకుంటున్న పోలీస్ అధికారిని రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణ పోలీస్ స్టేషన్లో ఎస్ఐగా పనిచేస్తున్న భాస్కర చారి బుధవారం ఒక వ్యక్తి నుంచి రూ.7 వేల లంచం స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు.



నిజామాబాద్ రేంజ్ ఏసీబీ డీఎస్పీ శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక దాడుల్లో భాగంగా లంచం తీసుకుంటూ ఉండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఒక సివిల్ వివాదానికి సంబంధించిన కేసులో సెక్షన్ మార్పు చేయడం కోసం ఎస్ఐ భాస్కర చారి ఈ లంచాన్ని డిమాండ్ చేసినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. సమాచారం అందుకున్న ఏసీబీ అధికారులు ముందస్తు ప్రణాళికతో పట్టు బిగించి, లంచం స్వీకరిస్తున్న సమయంలోనే భాస్కర చారిని రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. అనంతరం ఆయనను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఈ ఘటనపై అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

# మంజీరా నదిని కాపాడాలి

**- అక్రమ ఇసుక తవ్వకాలపై కారేగావ్ గ్రామస్తులు ఆగ్రహం.**
**- లారీలను అడ్డుకొని నిరసన....**
**- ఎమ్మార్వోకు ఫిర్యాదు చేసిన ఫలితం లేకపోయిందని ఆరోపణ.**





కోటగిరి, మే 6 ( మనం న్యూస్ ): ఉమ్మడి మండలం పోతంగల్, కారేగావ్ గ్రామంలో బుధవారం గ్రామస్తులు, రైతులు కలిసి భారీ ఆందోళనకు దిగారు. మంజీర నదిలో జరుగుతున్న అక్రమ ఇసుక తవ్వకాలను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఇసుక లారీలను అడ్డుకొని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ సునీల్ తో పాటు స్థానికులు మాట్లాడుతూ., కొందరు అక్రమార్కులు యంత్రాల సహాయంతో నది లోతుగా ఇసుకను తవ్వుతున్నారని ఆరోపించారు. దీనివల్ల భూగర్భ జలాలు తీవ్రంగా తగ్గిపోతున్నాయని,



రాబోయే రోజుల్లో తాగునీటి సమస్య తలెత్తే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే పలుమార్లు అధికారులకు, స్థానిక ఎమ్మార్వోకు ఫిర్యాదు చేసినప్పటికీ సరైన చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఫిర్యాదు చేయడంతో ఎవరో అధికారులు అక్కడికి వచ్చారని, తూతూ మంత్రంగా చూసి వెళ్లిపోయారని, ఎటువంటి కఠిన చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ఇదే పరిస్థితి కొనసాగితే మంజీరా నది ఎడారిగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. మరోవైపు, మంజీరా పరిసరాల్లో ఉన్న ఎత్తిపోతల పథకాలు, లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల భవిష్యత్తులపై కూడా సందేహాలు వ్యక్తం చేశారు. యంత్రాల సహాయంతో ఇసుక తవ్వకాలు జరిపితే పక్కనున్న బోర్లు ఎండిపోతాయని మండిపడ్డారు.

జెసిబి యంత్రాలతో ఇసుక తవ్వకాలు జరపడానికి ఎవరు అనుమతి ఇచ్చారని ప్రశ్నించిన గ్రామస్తులు, వెంటనే ఈ అక్రమ కార్యకలాపాలను అరికట్టాలని, లేకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని గ్రామస్తులు హెచ్చరించారు.



## పోచమ్మ తల్లికి బోనాలు

బీబీపేట్, మే 06 (మనం న్యూస్) : బీబీపేట మండలంలోని యాడారం గ్రామంలోని ముదిరాజ్ కులస్తులు పెద్దమ్మ పండగలో భాగంగా బుధవారం పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. ప్రతి ఐదు సంవత్సరాలకు ఒక్కసారి జరిగే పండగలో భాగంగా మొదటగా గ్రామ దేవతలకు బోనాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తుందని అన్నారు. అంతకు ముందు పండగను పురస్కరించుకుని ఆలయాన్ని పూవులతో, విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ కులస్తులు, మహిళలు, గ్రామ ప్రజలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఆవు దొంగతనం చేసిన వ్యక్తి అరెస్ట్

బిచ్కుంద, మే 6 (మనం న్యూస్) : బిచ్కుంద మండల పరిధిలో పశువుల దొంగతనాలకు పాల్పడుతున్న హసగుల్ గ్రామానికి చెందిన మహమ్మద్ మజీద్ (22) అనే నిందితుడిని బిచ్కుంద పోలీసులు బుధవారం అరెస్టు చేశారు.

మే 4, 2026 రాత్రి సమయంలో పోతుల్వార్ అశోక్ అనే రైతు ఇంటి ముందున్న రేకుల షెడ్ తాళం పగలగొట్టి సుమారు 45,000 రూపాయల విలువైన ఆవు, పెయ్య మరియు దూడలను దొంగిలించినట్లు ఫిర్యాదు అందింది. ఈ మేరకు సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ జి. రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మే 6న అయ్యప్ప టెంపుల్ చౌరస్తా వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న మహమ్మద్ మజీద్ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా, సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో పలు ప్రాంతాల్లో పశువులను దొంగిలించి విక్రయించినట్లు నిందితుడు అంగీకరించాడు. నిందితుడి సమాచారం మేరకు, రెండు ఆవులను హసగుల్ గ్రామానికి చెందిన రియాజ్ ఖురేశీకి విక్రయించగా, ఇంకా విక్రయించకుండా ఉన్న నాలుగు పశువులను (రెండు ఆవులు, రెండు దూడలు) పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసిన పశువులను భద్రత నిమిత్తం శాతాపూర్ గోశాలకు తరలించారు. నిందితుడిని అరెస్టు చేసి, ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం న్యాయమూర్తి ఎదుట హాజరుపరచి జ్యుడీషియల్ రిమాండ్కు పంపినట్లు సబ్ ఇన్స్పెక్టర్ జి. రాజు తెలిపారు.



## రైతులకు ఇబ్బందులు కలుగవద్దు

మోర్తాడ్, మే 6 (మనం న్యూస్) ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా చూడాలని మోర్తాడ్ తహసిల్దార్ కృష్ణ ఆదేశించారు. బుధవారం ఆయన తన సిబ్బందితో కలిసి మండలంలోని మోర్తాడ్ సొసైటీతో పాటు మోర్తాడ్ పాలెం, దొనకలలో ఐకెపి సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు



కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ఇప్పటివరకు ఎంతమంది రైతులు ధాన్యాన్ని తీసుకువచ్చారు ఎన్ని లోడ్లు రైస్ మిల్లులకు పంపారో అడిగి తెలుసుకుని రికార్డులను పరిశీలించారు. ఎక్కడ కూడా నిర్లక్ష్య వైఖరి కనబడకూడదని, రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యాన్ని వెంట తూకం వేయించి కొనుగోలు చేయాలని ఆదేశించారు. తప్పనిసరిగా ప్రతి వివరాన్ని రికార్డులో నమోదు చేయాలని నిర్లక్ష్యం పనికి రాదని స్పష్టం చేశారు. ఎక్కడ రైతుకి ఇబ్బంది జరిగిన రికార్డుల్లో అవకతవకలు జరిగిన చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటలను పండించి రైతులు లాభాలు పొందాలి

- ఏఎంసీలో రైతు వారోత్సవాలు.
- రైతులకు ఎమ్మెల్యే భూపతి రెడ్డి సూచనలు
- వ్యవసాయానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని వెల్లడి.
- అధికారుల ప్రగతి నివేదికలు - రైతు సంక్షేమంపై దృష్టి.
- సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచన.
- డిమాండ్ ఉన్న పంటల సాగుతో లాభాలు సాధించాలని సూచన
- ఉద్యానవన పంటల వైపు రైతులు మొగ్గు చూపాలని పిలుపు
- ప్రభుత్వ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచన.
- రైతుల అభిప్రాయాలు
- సదుపాయాలపై హర్షం

నిజామాబాద్ రూరల్, మే 6 (మనం న్యూస్): నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని ఏఎంసీ ప్రాంగణంలో బుధవారం రైతు వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి నేతృత్వంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ సహకార సంఘాల అధికారులు రైతుల సంక్షేమార్థం చేపట్టిన కార్యక్రమాలపై ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. రైతులకు పరికరాలు, వ్యవసాయ ఉత్పత్తులు, స్వల్పకాలిక రుణాలు అందిస్తున్నట్లు వివరించారు. అనంతరం ఉత్తమ రైతులను ప్రశంస పత్రాలతో సత్కరించగా, ఏర్పాటు చేసిన స్టాళ్లను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ., రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తూ రైతులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తోందని తెలిపారు. మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటలను సాగు చేస్తే మంచి లాభాలు పొందవచ్చని సూచించారు. భూసార పరీక్షలు నిర్వహించి తగిన పంటలను సాగు చేయాలని, కూరగాయలు, ఉద్యానవన పంటల వైపు మొగ్గు చూపాలని పిలుపునిచ్చారు. పంటమార్పిడి ద్వారా భూసారం పెరుగుతుందని వివరించారు. రైతులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముప్పగంగారెడ్డి, వైస్ చైర్మన్ రామ్చందర్, జిల్లా యువ నాయకుడు అమ్మాజీ నరేష్ వివిధ మండలాల అధ్యక్షులు మోపాల్ సాయి రెడ్డి, ఆర్మూర్ బాలరాజు, ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.





# కొండాపూర్ గ్రామంలో ఉత్సాహంగా జనగణన సర్వే



- ఇంటింటికి వెళ్లి గృహ వివరాల సేకరణ
- సామాజిక, ఆర్థిక సమాచారం నమోదు.
- భవిష్యత్ పథకాల అమలుకు డేటా సేకరణ.

నిజామాబాద్ రూరల్, మే 6 (మనం న్యూస్) : సిరికొండ మండలం కొండాపూర్ గ్రామంలో జనగణన కార్యక్రమం ఉత్సాహంగా కొనసాగుతోంది. బుధవారం ఉపాధ్యాయులు ఇంటింటికి తిరుగుతూ ప్రాథమిక గృహ సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో భాగంగా ప్రతి ఇంటి హౌస్ నెంబర్, సొంత లేదా అద్దె ఇల్లు, వాహనాల వివరాలు, తాగునీటి సౌకర్యం, గ్రామపంచాయతీ నీటి కనెక్షన్ వంటి అంశాలను నమోదు చేస్తున్నారు. అలాగే కుటుంబాల సంఖ్య, సభ్యుల వివరాలను ఖచ్చితంగా సేకరిస్తున్నారు. ఈ ప్రక్రియ ద్వారా గ్రామంలోని సామాజిక, ఆర్థిక పరిస్థితులపై సమగ్ర సమాచారం లభించి, భవిష్యత్తులో ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడానికి ఇది ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు.

# ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన బాడ్సి శేఖర్ గౌడ్

- రాష్ట్ర కల్లుగీత కార్మిక సహకార కార్పొరేషన్ చైర్మన్గా నియామకం.
- శాలువాతో సత్కరించి అభినందించిన ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి.

నిజామాబాద్ రూరల్, మే 6 (మనం న్యూస్) : రాష్ట్ర కల్లుగీత కార్మిక సహకార కార్పొరేషన్ చైర్మన్గా నియమితులైన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బాడ్సి శేఖర్ గౌడ్ బుధవారం నిజామాబాద్





రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డిని ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శాలువాతో సత్కరించి శేఖర్ గౌడ్కు అభినందనలు తెలిపారు. మిఠాయిలు తినిపించి ఆనందం పంచుకున్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి తగిన గుర్తింపు, గౌరవం లభిస్తుందనే దానికి ఇదే నిదర్శనమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు అమృతాపూర్ గంగాధర్, ప్రధాన కార్యదర్శులు పొలసాని శ్రీనివాస్, భాస్కర్ రెడ్డి, రాంచందర్ గౌడ్, డివిజన్ నంబర్ 1 కార్పొరేటర్ అగ్గు భోజన్న, ధర్మాగౌడ్, హన్మండ్లు, ఆయా గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# నూతన మండల కాంగ్రెస్ అధ్యక్షులకు సన్మానం

బిచ్కుంద, మే 6 (మనం న్యూస్): జుక్కల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గంలోని వివిధ మండలాలకు నూతనంగా నియమితులైన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులను ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు సాదరంగా ఆహ్వానించి, వారిని ఘనంగా సన్మానించారు. రాబోయే రోజుల్లో పార్టీని క్షేత్రస్థాయిలో మరింత పటిష్టం చేసేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే కాకుండా, స్థానిక సమస్యల పరిష్కారంలో చురుకైన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలు, నాయకులు కలిసికట్టుగా ఉండి నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పడాలని దిశానిర్దేశం చేశారు.

# పదవ తరగతి టాపర్లను సన్మానించిన సర్పంచ్

భీమ్గల్, మే 6 (మనం న్యూస్): ఇటీవల వెలువడిన పదవ తరగతి పరీక్షలలో ఉత్తమ శ్రేణిలో ఉత్తీర్ణులైన భీమ్గల్ మండల్ చేంగల్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థులను పాఠశాల ఆధ్వర్యంలో బుధవారం పాఠశాలలో అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ దుమాల మమత (రాజు)హాజరై వారి స్వంత డబ్బులతో పాఠశాల టాపర్ గా నిలిచిన విద్యార్థిని విద్యార్థులకు పాఠశాల ఉపాధ్యాయ బృందంతో కలిసి వారి చేతుల మీదుగా శాలువా పూలమాల అలాగే డైరీలను అందజేసి ఘనంగా సన్మానించి అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ., ప్రవేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ ఉత్తమ ఫలితాలు సాధించడం అభినందనీయమని, పదో తరగతి ఫలితాల్లో పాఠశాల నుండి ఫస్ట్ క్లాస్ గా వచ్చిన ఆదర్శ్ 535 మార్కులు, సెకండ్ క్లాస్ గా వచ్చిన స్వాతిక 534 మార్కులు, అలాగే మిగతా విద్యార్థులు కూడా మంచి మంచి మార్కులు సాధించి గ్రామాని కి మంచి పేరు సాధించారని ఆశాభవం వ్యక్తం చేశారు. ఇలాగే ముందుకు వెళ్లి ఉన్నత లక్ష్యాలు సాధించి గ్రామానికి ఉపాధ్యాయులకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకువచ్చి గుర్తింపు పొందాలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయ బృందం, పంచాయతీ సెక్రెటరీ ప్రతీప్,ఉప సర్పంచ్ నాతి మోహన్ గౌడ్, పాలకవర్గం సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.






## జనగణనలో సరికొత్త అధ్యాయం

**ప్రారంభమైన 'డిజిటల్' స్వీయ గణన..**
**మే 10 వరకు ఆన్లైన్లో వివరాలు నమోదు చేసుకోవచ్చు: భిక్నూర్ తహసీల్దార్ సునీత**

భిక్నూర్, మే 06 ( మనం న్యూస్ ) : భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న 2027 జనగణన ప్రక్రియలో భాగంగా తొలిసారిగా డిజిటల్ విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు. ప్రజలు తమ వివరాలను తామే స్వయంగా నమోదు చేసుకునే 'స్వీయ గణన' సౌకర్యంపై భిక్నూర్ తహసీల్దార్ సునీత అవగాహన కల్పించారు. ఏప్రిల్ 26 నుండి మే 10, 2026 వరకు ఆన్లైన్ లో నమోదు చేసుకోవచ్చు అని తెలిపారు. దీనికి సంబంధించి అధికారిక వెబ్సైట్ ట్ప.ఛ్ఫ్ఋఋజౌరి.జీ ఆన్లైన్ ద్వారా కుటుంబ వివరాల నమోదు చేసుకోవచ్చు అని తెలిపారు. వివరాల్లోకి వెళితే కేంద్ర ప్రభుత్వం జనగణన ప్రక్రియను మరింత వేగవంతం మరియు పారదర్శకం చేసేందుకు ఈ ఏడాది డిజిటల్ విప్లవానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా పౌరులు తమ ఇంటి నుండే స్వయంగా కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేసుకునే వెసులుబాటు కల్పించారు. తహసీల్దార్ సునీత సూచనలు చేస్తూ భిక్నూర్ మండలంలోని పౌరులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం కేటాయించిన నిర్ణీత గడువు (మే 10) లోపు నిర్దేశించిన వెబ్సైట్ సందర్శించి వివరాలు నమోదు చేయాలని సూచించారు. డిజిటల్ పద్ధతిలో వివరాలు నమోదు చేయడం వల్ల సమయం ఆదా అవ్వడమే కాకుండా, గణన ప్రక్రియలో ఖచ్చితత్వం పెరుగుతుందని ఆమె పేర్కొన్నారు. పౌరులు తమ స్మార్ట్ఫోన్ లేదా కంప్యూటర్ ద్వారా సులభంగా ఈ ప్రక్రియను పూర్తి చేయవచ్చని, ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత అధికారులను సంప్రదించాలని ఆమె తెలియజేశారు.

## పీఏసిఎస్ చైర్మన్గా మొహినుద్దీన్ కొనసాగింపు



రెంజల్, మే 06 (మనం న్యూస్ ): హైకోర్టు ఆదేశాల మేరకు రెంజల్ మండల ప్యాక్స్ చైర్మన్గా ఇంతకుముందు కొనసాగుతున్న మొహినుద్దీన్కే మరోసారి బాధ్యతలు కొనసాగింపుగా లభించాయి. ఈ మేరకు సంబంధిత అధికారులు అధికారికంగా ప్రకటించారు. ఇప్పటికే చైర్మన్గా సేవలందిస్తున్న మొహినుద్దీన్కు కోర్టు ఆదేశాలతో కొనసాగింపు రావడంతో ఆయన అనుచరులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేశారు. గ్రామంలో పటాకులు పేల్చి, మిఠాయిలు పంచుకుంటూ సంబరాలు జరుపుకున్నారు. స్థానిక రైతులు, సభ్యులు మాట్లాడుతూ., మొహినుద్దీన్ నాయకత్వంలో ప్యాక్స్ ద్వారా రైతులకు మంచి సేవలు అందుతున్నాయని, ఈ కొనసాగింపుతో మరింత అభివృద్ధి జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్యాక్స్ సీఈఓ ఇంద్రాసేన్ పాల్గొన్నారు. మొహినోద్దీన్ మాట్లాడుతూ., తనపై విశ్వాసం ఉంచిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. రైతుల సంక్షేమం కోసం మరింత కృషి చేస్తానని, ప్యాక్స్ను అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పి ఏ సీ ఎస్ సీఈఓ ఇంద్రాసేన్ అలాగే గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# రైతు ముసుగులో నల్లమట్టి దందా చేస్తే ఖబడ్దార్

**ప్రాణత్యాగానికైనా సిద్ధం**
**ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి సంచలనం.**
**తనను కొందరు కావాలనే టార్గెట్ చేస్తున్నారు**





ఆర్మూర్,మే 6 ( మనం న్యూస్ ): ఆర్మూర్, నందిపేట్ గోదావరి పరివాహక ప్రాంతంలో సాగుతున్న నల్లమట్టి తరలింపు వ్యవహారం ఇప్పుడు ఆర్మూర్ రాజకీయాల్లో సెగలు రేపుతోంది. తనపై వస్తున్న ఆరోపణలపై ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి నిప్పులు చెరిగారు. 'నన్ను బదనాం చేయాలని చూస్తే ఊరుకోను.. రైతుల ముసుగులో సిండికేట్ దందాలు చేస్తామంటే నడవదు' అంటూ ప్రత్యర్థులకు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. బుధవారం నందిపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన అత్యంత ఆవేశంగా, భావోద్వేగంతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన లేవనెత్తిన ప్రధానాంశాలు ఇవే.

**సిండికేట్ మాఫియాపై ఉక్కుపాదం.**

రైతుల పేరు చెప్పుకుని గ్రామాల్లో కమిటీల పేరిట వసూళ్లకు పాల్పడుతున్న వారిపై ఎమ్మెల్యే విరుచుకుపడ్డారు. నల్లమట్టిని పొలాలకు కాకుండా, ఇతర ప్రాంతాల్లోని ఇటుక బట్టీలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని, ఇలాంటి సిండికేట్ వ్యాపారాలను అడ్డుకుంటానని స్పష్టం చేశారు. దీనివల్ల సామాన్య రైతుపై అనవసరపు ఆర్థిక భారం పడుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

**'అతివేగం' అడ్డుకుంటే తప్పా ?**

ఇరుకు రోడ్లలో వందలాది భారీ వాహనాలు అతివేగంగా వెళ్తుంటే ప్రమాదాలు జరుగుతాయని హెచ్చరించినందుకు తనను కావాలనే కొందరు టార్గెట్ చేస్తున్నారని రాకేష్ రెడ్డి మండిపడ్డారు. ఇదే విషయాన్ని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, కూడా చెప్పారని గుర్తు చేస్తూ, ప్రజల ప్రాణాల కంటే రాజకీయం ముఖ్యం కాదని హితవు పలికారు.

**రైతు బిడ్డగా ప్రాణ త్యాగానికైనా రెడీ..**

ముఖ్య హెచ్చరికలు, హామీలు: అపోహలు వద్దు నల్లమట్టిని రైతులు తమ పొలాలకు తరలించుకుంటే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, లేనిపోని పుకార్లను నమ్మవద్దని కోరారు.

**ధాన్యం తరలింపు.**

నెలరోజులుగా కల్లాల్లోనే వడ్లు పేరుకుపోయాయని, వాటిని వెంటనే తరలించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

**అండగా ఉంటాం.**

సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని, అవసరమైతే ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ లతో మాట్లాడి పరిష్కరిస్తానని రైతులకు భరోసా ఇచ్చారు. రెండున్నరేళ్లుగా ఎలాంటి మచ్చ లేకుండా పనిచేస్తున్నానని చెప్పుకొచ్చిన ఎమ్మెల్యే, నల్లమట్టి వ్యవహారంలో జరుగుతున్న అక్రమాలను వదిలిపెట్టే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. రైతు రక్షణ కవచంలా ఉంటానంటూనే, మాఫియా ఆటలు సాగనివ్వనని ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారాయి.


## పలు వివాహాలకు హాజరైన రూరల్ ఎమ్మెల్యే


**– నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే.**

నిజామాబాద్ రూరల్, మే 6 (మనం న్యూస్): నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి బుధవారం పలు వివాహ వేడుకలకు హాజరై సందడి చేశారు. డిచ్పల్లి శివారులోని సుగుణ గార్డెన్లో కాంగ్రెస్ పార్టీ నాయకుడు గుడి ప్రవీణ్ రెడ్డి కూతురు వివాహానికి హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు.

అనంతరం అమృతా గార్డెన్లో కాంగ్రెస్ నాయకుడు ఎరుకుల్ల శ్రీనివాస్ కూతురి వివాహంలో పాల్గొని వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే భూమ్ రెడ్డి గార్డెన్లో సందగిరి విక్రమ్ రెడ్డి కుమారుడి వివాహానికి హాజరై ఆశీర్వదించారు. ఇక ఎస్ఎల్వీ గార్డెన్లో కాంగ్రెస్ నాయకుడు రంగు అశోక్ కూతురి వివాహానికి హాజరైన ఎమ్మెల్యే, డిచ్పల్లి మండలం కొరట్పల్లి గ్రామంలోని సిఎస్ఐ చర్చ్లో నిర్వహించిన బైరి మోహన్ కూతురి వివాహంలో కూడా పాల్గొని నూతన వధూవరులకు ఆశీస్సులు అందించారు. వైవాహిక జీవితం ఆనందంగా, సుఖసంతోషాలతో కొనసాగాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమాల్లో ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు ఎమ్మెల్యే వెంట పాల్గొన్నారు.









## సిరికొండలో మహిళల హక్కులపై అవగాహన కార్యక్రమం

**– సఖి/వన్ స్టాప్ సెంటర్ ఆధ్వర్యంలో కార్యక్రమం.**
**– గృహ హింస నిరోధక చట్టంపై వివరణ.**
**– మహిళల రక్షణ, అత్యవసర సేవలపై అవగాహన.**

నిజామాబాద్ రూరల్, మే 6 (మనం న్యూస్) : సిరికొండ మండల కేంద్రంలో బుధవారం 99 రోజుల ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా నిజామాబాద్ సఖి/వన్ స్టాప్ సెంటర్ ఆధ్వర్యంలో సిరికొండ గ్రామ పంచాయతీలో వివో మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు మరియు బాలల హక్కులు, గృహ హింస నిరోధక చట్టం (2005), మహిళల రక్షణపై విస్తృత అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సఖి సెంటర్ ద్వారా అందిస్తున్న సేవలపై వివరించారు. అత్యవసర సహాయం, కౌన్సిలింగ్, న్యాయ సహాయం వంటి సేవలను అవసరమైన మహిళలు వినియోగించుకోవాలని సూచించారు.

మహిళల భద్రత, సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించగా, కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు ఆసక్తిగా వినిపించి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో భానుప్రియ, స్రవంతి, ప్రమీల, ఉమెన్ కానిస్టేబుల్, ఉప సర్పంచ్ గ్యామ శోభన్, పంచాయతీ కార్యదర్శి వినీల్ మహిళలు తదితరులు పాల్గొన్నారు.



## గ్రామ స్థాయి నుంచి బలోపేతం దిశగా

# కాంగ్రెస్కు కొత్త నాయకత్వం

**– జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్.**



కామారెడ్డి, మే 06 (మనం న్యూస్): తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బి. మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు, కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ నాయకత్వంలో జిల్లాలో నూతన నాయకత్వానికి శ్రీకారం చుట్టారు. జిల్లాలోని జుక్కల్, ఎల్లారెడ్డి, కామారెడ్డి నియోజకవర్గాల పరిధిలో వివిధ మండలాలు, పట్టణాలకు నూతనంగా నియమితులైన అధ్యక్షులను అభినందిస్తూ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపారు. ఈ సందర్భంగా డిసిసి అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ మాట్లాడుతూ., పార్టీ బలోపేతానికి ఈ నియామకాలు కీలకమని పేర్కొన్నారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన నాయకులు ప్రజల్లోకి వెళ్లి కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను విస్తృతంగా చాటాలని సూచించారు. గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా సమిష్టి కృషి అవసరమని, ప్రజల విశ్వాసాన్ని గెలుచుకోవడంలో ప్రతి నాయకుడు పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి ఈ నియామకాలు బలమైన పునాదులు అవుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.



**కామారెడ్డి నియోజకవర్గం అధ్యక్షులు**

కామారెడ్డి నియోజకవర్గం నూతనంగా ఎన్నికైన మండల, పట్టణ అధ్యక్షులు, కామారెడ్డి టౌన్ ఐరేని సందీప్, కామారెడ్డి రూరల్ ధర్మగౌరీ రాజాగౌడ్, మాచారెడ్డి, మాలోత్ నౌసిలాల్ నాయక్, పాల్వంచ రమేష్ గౌడ్, బిబిపేట, పాత రాజు, దోమకొండ ఆశబోయిన శ్రీనివాస్, బిక్నూర్, నాగన్నగారి నరేందర్ రెడ్డి, రాజంపేట్ అంకం కృష్ణారావు అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. నూతన అధ్యక్షులు మాట్లాడుతూ., పార్టీ తమపై ఉంచిన విశ్వాసానికి కృతజ్ఞతలు తెలిపారు. అధిష్టాన నాయకత్వానికి ధన్యవాదాలు తెలియజేస్తూ, అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తిస్తామని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ కేవలం రాజకీయ పార్టీ కాకుండా కార్యకర్తలకు గౌరవం ఇచ్చే కుటుంబమని, కష్టానికి గుర్తింపు లభిస్తుందనే సందేశాన్ని తమ నియామకం ఇచ్చిందన్నారు. మాజీ మంత్రి మహమ్మద్ అలీ షబ్బీర్ సేవలను కొనియాడుతూ, ఆయన మార్గదర్శకత్వంలో ముందుకు సాగుతామని తెలిపారు. ఇకముందు పాత-కొత్త తేడా లేకుండా అందరినీ కలుపుకుని పార్టీని బలోపేతం చేస్తామని, ప్రజాసేవే లక్ష్యంగా ప్రతి ఇంటికి కాంగ్రెస్ను తీసుకెళ్తామని స్పష్టం చేశారు.

## అయిల్ ఫామ్ సాగుతో

# రైతులకు అధిక ఆదాయం

**– జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్.**

కామారెడ్డి, మే 06 ( మనం జిల్లా ప్రతినిధి ) : కామారెడ్డి జిల్లా తాడ్వాయ్ మండలం ఏంద్రియల్ గ్రామ శివారులో రైతు బొక్క హన్మాండ్లు మూడున్నర ఎకరాలలో సాగు చేస్తున్న అయిల్ ఫామ్ తోటను బుధవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సందర్శించారు. తోటలో మొక్కల పెరుగుదల, నిర్వహణ విధానాలు, సాగు పద్ధతులను పరిశీలించిన కలెక్టర్ పంట అభివృద్ధిపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతు బొక్క హన్మాండ్లు మాట్లాడుతూ., 2022 సంవత్సరంలో మూడున్నర ఎకరాలలో అయిల్ ఫామ్ పంటను ప్రారంభించినట్లు తెలిపారు. మూడున్నర ఎకరాలలో అయిల్ ఫామ్తో పాటు అంతర్ పంటలుగా కూరగాయలు, సోయా, ఆకుకూరలు, పండ్ల తోటలను సాగు చేస్తూ ఏడాదికి సుమారు రూ.1.20 లక్షల ఆదాయం పొందుతున్నట్లు తెలిపారు. అయిల్ ఫామ్ సాగుకు ఉద్యానవన శాఖ ద్వారా గత నాలుగు సంవత్సరాలుగా ఎకరానికి రూ.4,200 చొప్పున సబ్సిడీ అందించడంతో పాటు డ్రిప్ పరికరాలు కూడా మంజూరు చేసినట్లు రైతు వివరించారు. ప్రభుత్వ సహకారంతో సాగు ఖర్చులు తగ్గి, దిగుబడి పెరిగిందని పేర్కొన్నారు. ప్రస్తుతం అయిల్ ఫామ్ పంట ధర టన్నుకు సుమారు రూ.23,000 ఉండగా, ఎకరానికి 10 నుంచి 12 టన్నుల వరకు దిగుబడి ఉంటుందని రైతు ఆనందం వ్యక్తం చేశారు. దీర్ఘకాలికంగా లాభదాయకమైన పంటగా అయిల్ ఫామ్ రైతులకు మంచి ఆదాయ వనరుగా మారుతోందన్నారు.

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ., సంప్రదాయ పంటలతో పాటు మార్కెట్ డిమాండ్ ఉన్న వాణిజ్య పంటలు, అంతర్ పంటల సాగు ద్వారా రైతులు ఆదాయాన్ని పెంచుకోవచ్చని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలు, సాంకేతిక సలహాలను వినియోగించుకొని మరిన్ని రైతులు అయిల్ ఫామ్ సాగుపై ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జియచ్ఎస్ఓ జ్యోతి, సీపీవో, డిఎల్పివో , ఎమ్మార్వో, ఎంపీవో, సర్పంచ్ సంబంధిత శాఖల అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.











## అత్యవసర సమయంలో అండగా సీఎం సహాయనిధి

**– రూ.3 లక్షల ఎల్ఓసి లెటర్ అందజేసిన ఎమ్మెల్యే.**

**– నిరుపేదలకు సీఎం సహాయనిధి తోడ్పాటు.**

**– గడ్కోల్ గ్రామానికి చెందిన మహిళకు ఆర్థిక సహాయం.**

నిజామాబాద్ రూరల్, మే 6 (మనం న్యూస్): నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి నిరుపేదలకు అత్యవసర సమయంలో ముఖ్యమంత్రి సహాయనిధి గొప్ప అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. సిరికొండ మండలం గడ్కోల్ గ్రామానికి చెందిన కల్లెం సులోచన అనారోగ్య సమస్యలతో హైదరాబాద్లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. శస్త్రచికిత్స కోసం రూ.3 లక్షలు అవసరమని వైద్యులు సూచించగా, ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో బుధవారం రూ.3 లక్షల ఎల్.ఓ.సి (లెటర్ ఆఫ్ క్రెడిట్) ను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి వెల్మ భాస్కర్ రెడ్డి కుటుంబ సభ్యులు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.






## మహిళపై దాడి చేసిన ఇద్దరు నిందితుల అరెస్ట్

**– రిమాండ్కు తరలింపు**

భిక్నూర్, మే 06 ( మనం న్యూస్ ): మద్యం మత్తులో ఇంటిపైకి వెళ్లి దాడికి పాల్పడటమే కాకుండా, అడ్డువచ్చిన మహిళను గాయపరిచిన ఇద్దరు నిందితులను భిక్నూర్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్కు తరలించారు. భిక్నూర్ ఎస్ఐ డి. ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం., ఈ ఘటనకు సంబంధించిన పూర్తి సమాచారం ఇలా ఉంది. ఘటన నేపథ్యం మండలంలోని మోటట్పల్లి గ్రామానికి చెందిన గడ్డమిడి స్వామి అనే వ్యక్తి కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గత నెల 29వ తేదీ (ఏప్రిల్ 29) రాత్రి సుమారు 9:30 గంటల సమయంలో, అదే గ్రామానికి చెందిన గడ్డమిడి అంజనేయులు మరియు గడ్డమీది రంజిత్ కుమార్ మద్యం సేవించి స్వామి ఇంటికి అక్రమంగా చొరబడ్డారు. అక్కడ స్వామితో పాటు అతని తండ్రి అంజయ్యను అసభ్య పదజాలంతో దూషిస్తూ దాడికి దిగారు. ఈ క్రమంలో గొడవను ఆపడానికి వచ్చిన లావణ్య అనే మహిళను నిందితులు తీవ్రంగా తోసివేశారు. అంతటితో ఆగకుండా రంజిత్, అంజనేయులు కలిసి ఆమెపై బండరాయితో దాడి చేయగా, ఆమె కుడి చేతికి తీవ్ర గాయమైంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఏప్రిల్ 30న భిక్నూర్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. కేసును దర్యాప్తు చేసిన పోలీసులు, బాధితురాలి గాయాల తీవ్రతను పరిగణనలోకి తీసుకుని బుధవారం (మే 06) మోటట్పల్లి గ్రామంలో నిందితులు గడ్డమిడి అంజనేయులు, గడ్డమీది రంజిత్ కుమార్ లను అదుపులోకి తీసుకున్నారు. వారిని అరెస్ట్ చేసి జ్యుడీషియల్ రిమాండ్కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. ప్రస్తుతం ఈ కేసుపై తదుపరి దర్యాప్తు కొనసాగుతోందని ఆయన పేర్కొన్నారు.

## పెద్దమ్మ ఆలయానికి విరాళం

బీబీపేట్, మే 06 (మనం న్యూస్): బీబీపేట మండలంలోని యాడారం గ్రామంలోని పెద్దమ్మ ఆలయానికి ప్రముఖ వ్యాపారవేత్త, జనగామ వాస్తవ్యులు తిమ్మయ్యగారి సుభాష్ రెడ్డి లక్ష రూపాయల విరాళాన్ని ముదిరాజు సంఘం సభ్యులకూ అందించటం జరిగింది. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ., పెద్దమ్మ తల్లి అనుగ్రహం వారికి, వారి కుటుంబ సభ్యులకు ఉండాలని కోరుతూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం



ఆయననూ ముదిరాజు సంఘం సభ్యులు శాలువాతో సన్మానం చేశారు.ఇట్టి కార్యక్రమంలో మట్ట శ్రీనివాస్ జనగామ సర్పంచ్, కప్పెర రవీందర్ రెడ్డి మాజీ వైస్ ఎంపీపీ, సుధారాణి బాపురెడ్డి సర్పంచ్ యడారం, స్వామి, వెంటేశం, సాయికుమార్, అశోక్ గౌడ్, సిద్దరాములు, రవి,బాబు,ముదిరాజ్ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.